# రేడియో కార్యక్రమాలు! - by SKU

Back Home

సిన్న రచ్చబండ లో ఎవరో పాత కాలం రేడియో ప్రోగ్రాముల గురించి ఒక టాపిక్ మొదలెట్టారు. అది చూడగానే నేను రింగులు తిప్పేసుకున్నాను. చిన్నప్పటి రేడియో దెబ్బలాటలు.. ముఖ్యంగా అక్కతో, నాన్నగారితో పోయిన పంతాలు.. పట్టింపులు!

మా ఇంట్లో వున్నది ఒక్కటే రేడియో. పైన అమ్మమ్మ వాళ్ళ ఇంట్లో ఒక రేడియో వుంది. కానీ అది పాత కాలం కరెంటు రేడియో. ఏదైనా మంచి పాట పక్కింట్లో విని, విందామని రేడియో ఆన్ చేస్తే, దీనికి బోలెడు సేపు వేడి ఎక్కటం వుండేది. ఈ లోగా పుణ్యకాలం అంతా గడిచిపోయి పాట అయిపోయేది!

పైగా, తాతగారు కళ్ళ ఆపరేషన్ ఫెయిల్ అవటం తో రేడియో ట్యూన్ చేసుకొనే పరిస్థితి లో వుండేవారు కాదు. అమ్మమ్మ కి ఎప్పుడూ పొద్దుటే వైజాగ్ స్టేషన్ లో వచ్చే సంగీతం కార్యక్రమాల దగ్గర ట్యూన్ చేసుకుని వుండేది. తన ప్రోగ్రామ్ టైము కి రేడియో కానీ వేరే స్టేషన్ కి ట్యూన్ అయి వుంటే తనకి తిక్క రేగేది!! ఇంక తాతగారు చాలా శాంత స్వభావి! ఆయన మెత్తగా మందలించేవారు.. తను వినే వార్తల టైముకి రేడియో వేరే చోట ట్యూన్ చేసి వుంటే, "నువ్వు వినేది వినేసి, మళ్ళీ స్టేషన్ మార్చేయచ్చుకదమ్మా?" అని!

అమ్మమ్మ అయితే.. "రేడియో అసలు నువ్వు ముట్టుకోకు" అని ఆజ్ఞలు జారీ చేసేది. అయినా మనకి సిగ్గా ఎగ్గా!? దేవుడు చెవులు రెండూ ఎదురెదురుగా ఎందుకు వుంచారు? అంటే.. "ఈ చెవి తో విని, ఆ చెవి తో వదిలేయటానికి!" అన్నట్టు.. తను చెప్పేది చెప్తూనే వుండేది, నేను చేసేది చేస్తూనే వుండేదాన్ని!

కానీ మనకీ కొంచెం ఒకోసారి సిగ్గు లాంటిది వేసేది! అప్పుడు వచ్చి ఇంకా ఎక్కువ కాంపిటీషన్ వున్న కింద రేడియో మీద పడేదాన్ని! పైన రేడియో అంటే, వాళ్ళిద్దరూ పాపం మన జబర్దస్తీ కి సాగిపోయేది కానీ కింద మా నాన్నగారు, అక్క, చెల్లి అలా కాదు!!

నాన్నగారికి పొద్దుటే వచ్చే సుప్రభాతం తో నిద్ర లేవాలి. ఆయనకి రేడియో లో (వైజాగ్ స్టేషన్ లో) ఏ రోజు ఏం సుప్రభాతం కార్యక్రమం వస్తుందో మహాబాగా తెలుసు! విష్ణు మూర్తి లాగ మంచం మీద పడుకొని, మంచి నిద్ర లో వున్న మమ్మల్ని తను కళ్ళు మూసుకొనే, "టైము ఎంతయిందే?" అని అడిగేవారు. మేము ఆ కేక కి నిద్రలు లేచి, మేము పడుకున్న గది లో గోడ గడియారం లో టైము చూసి చెప్పాలి. ఆయన తన సుప్రభాతం టైము కాకపోతే మళ్ళీ పడుకునేవారు.. మేము గొణుక్కుంటూ మిగిలేవాళ్ళం మమ్మల్ని నిద్ర లేపేసినందుకు! అమ్మ పాపం దొడ్లో బాయిలర్ వెలిగించటం, ఇంటి పనులు చేసుకోవటం చేసేది!

ఇంక సుప్రభాతం టైము అయితే, "ఆ రేడియో పట్రావే" అనేవారు! మేము నిద్ర పోతున్నట్టు నటించినా ఆయన పట్టు వదలని విక్రమార్కుడి లా, "అమ్మా అన్నపూర్ణా", "అమ్మా సూర్యా", "అమ్మా బంగారం!" అంటూ మహా ముద్దు గా ఆర్డర్లు వేసేవారు! మేము నిద్రల్లోంచి లేచి, ఆయనకి ముందు గదిలో రేడియో ప్లేసు లో గుడ్డ కప్పి పెట్టిన (మా నాన్నగారికి రాత్రి చూడటం, వినటం అయ్యాక, ప్రతీ దానికీ, అంటే, TV కీ, రేడియో కీ పైన దుమ్ము పడకుండా గుడ్డలు కప్పటం అలవాటు! ఏంటీ మా రేడియో ఏ మాత్రం పెద్దదో అనుకుంటున్నారా? చిన్న రేడియో! దానికి సరిపడే ఓ గుడ్డ తెచ్చి

మా అమ్మగారి చేత దాని షేపు లో దానికి ఒక తొడుగు కుట్టించారు!) రేడియో తీసుకెళ్ళి ఆయన వినబోయే వైజాగు స్టేషన్ ట్యూన్ చేసి పెట్టాలి! ఇక్కడ ఒక ఇబ్బంది వుంది. ఒకవేళ ఆ రేడియో పెట్టే టైము కి ఆ రేడియో కానీ వేరే స్టేషన్ లో వుంటే.. మేం చచ్చామన్న మాటే! మేము ఏమిటి లెండి.. ఎక్కువ ఇలాంటి తింగరి పనులు చేసి దొరికిపోయేదాన్ని నేనే! మా అక్క, చెల్లీ చాలా బుద్ధిమంతులు పాపం! ఎప్పుడూ ఆయన చెప్పినట్టే వుండేవారు. ఒకవేళ ఏమైనా వేరే స్టేషన్లు విన్నా, వెంటనే ఆ ప్రోగ్రామ్ అయిపోగానే, వైజాగ్ స్టేషన్ కి మార్చేసేవాళ్ళు. నేను ఏంటో ఆఖరున చేయాల్సిన ఆ చిన్న రొటీన్ ని మర్చిపోయేదాన్ని, తిట్లు తినేదాన్ని!

అసలు ఈ పొద్దుటే టైము చెప్పే కార్యక్రమం తో ఎంత విసిగిపోయామంటే.. ఒక పుట్టినరోజు కి ఆయనకి మా పోకెట్ మనీలు దాచి, ఒక గోడ గడియారం కొని, ఆయన నిద్ర లేవగానే కనపడేటట్టు ఆయన గది లో గోడకి తగిలించాము!! ఈ రేడియో గుడ్డలు కప్పటం, పొద్దుటే తీసుకెళ్ళి ఇవ్వటం అలవాటు మాత్రం మాన్పించలేకపోయాము!!

నాన్నగారి రొటీన్ భలే వుండేది! పొద్దుటే, సుప్రభాత సేవ తో నిద్ర లేచి, (అబ్బే, మంచం మీంచి కాదు!) అలా పడుకునే, (కళ్ళు మూసుకొని!) సుప్రభాత సేవ కానిచ్చి, పొలం పనులు కార్యక్రమం మొదలవగానే.. అంటే, "ఏం రామయ్యా దీర్ఘం గా ఆలోచిస్తున్నావూ.." advertisement మొదలవగానే లేచి దంతధావన కార్యక్రమం కి మొదలయ్యేవారు. పాలబ్బాయి వచ్చేదాకా వంటింట్లో కూర్చుని అమ్మతో, మాతో కబుర్లు చెప్పేవారు. పాలబ్బాయి వచ్చేక, అమ్మ పాలు కాఫీ కోసం స్టవ్ మీద పెట్టాక, తను పళ్ళు తోమటం మొదలెట్టేవారు. అప్పటికి "పొలం పనులు" అయి ప్రాంతీయ వార్తలు మొదలయ్యేవి. కాఫీ మళ్ళీ కట్టకట్టుకొని అందరం ఒకేసారి తాగాలి! ఆయనకి కాఫీ వేడిగా వుండాలి. అదే పద్ధతి లో మమ్మల్ని కూడా కాఫీ కలిపే టైముకి మొఖాలు కడిగి వచ్చి వంటింట్లో కూర్చోమని చంపేవారు! కాఫీ కలిపేసాక మేం ఎవరన్నా ఇంకా మొఖాలు కడగకండా కనిపిస్తే, "కాఫీ చల్లారిపోతోంది.. తొర్ తొరగా కానివ్వు!" అంటూ వెనకాలే షంటేవారు!

ఇంట్లో అందరం తలొక పొలిటికల్ పార్టీ సానుభూతిపరులం! కనుక ప్రాంతీయ వార్తలు వింటూ మా వ్యాఖ్యానాలు చేసుకుంటూ, కొండకచో వాదులాడుకుంటూ కాఫీలు కార్యక్రమం పూర్తి చేసేవాళ్ళం. వార్తలు అయిపోగానే, నేను మంచి నీళ్ళు పడుతూ, సిలోన్ తిప్పేసేదాన్ని రేడియో ని! ఆ టైము లో ఇక్కడ వైజాగ్ స్టేషన్ లో సంగీతం నేర్పటమో, లలిత సంగీతం నేర్పటమో చేసే కార్యక్రమాలు వచ్చేవి. అప్పట్లో మా సుజి కి ఇంకా తను ఏదో గాన కోకిల అవుతాను అనే భ్రమ వుండేది. నేను ఇంకా పెద్ద లక్ష్యం ని గురి పెట్టి.. అదే లతా మంగేష్కర్ అవుతా అని ఆవిడ పాటలు వచ్చే సిలోన్ పెట్టి, వాటి వెంట పాడదామని కష్టపడితే, మా చిన్నది వైజాగ్ స్టేషన్ వారి లలిత సంగీతం పాటలు తో సంతృప్తి పడేది. ఈ లోగా ఏ వేదవతీ ప్రభాకర్ లాంటి వారి పాటలు కూడా అప్పుడే వచ్చేవి. అవి వినటానికి మా అమ్మ గారు కూడ రేడియో కి పోటీ వచ్చేవారు.

రోజూ మన జులుం చెల్లదు కదా.. చెల్లని రోజు నాకు ఇష్టం లేని కార్యక్రమాన్ని కసి తీరా డిసెక్ట్ చేస్తూ, వినేవాళ్ళని విసిగించేదాన్ని! తరువాత సిలోన్ స్టేషన్ లో వచ్చే పాత హిందీ పాటలు మా అమ్మగారికి కూడా ఇష్టమయినవి వుండేవి. తను కూడా నోస్టాల్జిక్ అయేవారు. ఆ టైము లో ఎవరి లోకం లో వాళ్ళు వుండేవాళ్ళం. రేడియో వెనకాల రేడియో సౌండ్ ని మించి పాడేస్తూ, నాలాంటిది అయితే సంగీతాన్ని కూడా వదల కుండా హమ్ చేసేస్తూ.. పక్క వాళ్ళు ఎలా జుట్టు పీక్కుంటే మాకేం కానీ, మేం మాత్రం తెగ ఎంజాయ్ చేసేవాళ్ళం!

ఎనిమిది గంటలకి సిలోన్ వాళ్ళ "Ap Hi Ke Geet" వచ్చేది. "తినగా తినగా వేము తీయనౌను" అన్నట్టు వాళ్ళు ఎప్పుడూ దాదాపు ఒకటే సెట్ పాటలు చాలా రోజులు పాటు వేసేవారు. దానితో మొదట్లో నచ్చని పాట కూడా రోజూ వినటం తో నచ్చినట్టే వుండేది. పాడేసేదాన్ని! ఇది కూడ జబర్దస్తీ. మా అమ్మగారికి వైజాగ్ స్టేషన్ లో వచ్చే భక్తి గీతాలు ఇష్టం వుండేవి. కానీ, నేను వడనిచ్చేదాన్ని కాదు. ఈ సిలోన్ హిందీ పాటలు వినాలంటే, పెద్ద ఇబ్బంది వుండేది. మా రేడియో గట్టిగా పెట్టడానికి మాది బోలెడు వాటాల ఇల్లు. నాన్నగారికి తనకి పట్టని కార్యక్రమాలు గట్టిగా పెడితే ఇష్టం వుండదు.. చల్లగా వచ్చి రేడియో కట్టేసేవారు. మరి నేను గదులు ఊడుస్తూ, అన్ని గదులూ తిరుగుతుంటే, అక్క వేరే పనులు, అంటే, అమ్మ కి వంట లో సాయం చేస్తూ వంటింట్లో వుండేది, మూడోది మజ్జిగ తిప్పటం, కుంపటి వెలిగించటం లాంటి పనులు చేస్తూ దొడ్లో బిజీ గా వుండేది. అలాంటప్పుడు రేడియో ఎక్కడ పెట్టాలి అని గొడవ వచ్చేది! పోనీ ఇంక ఆ సిలోన్ స్టేషన్ అదేంటో మా రేడియో ని ఒక ఏంగిల్ లో పెడితేనే సరిగా వచ్చేది. లేకపోతే చాలా సౌండ్ వచ్చేది. పైగా, కరెంట్ వస్తువుల దగ్గర పెడితే పెద్ద శబ్దం. అమ్మ గ్రైండర్ ఆడిస్తే, భరించలేని రొద! పోనీ ఈ గొడవలన్నీ ఎందుకు అని త్వరగా గదులు ఊడ్చే పని పూర్తి చేద్దామంటే, అమ్మ ఆ పని అవగానే ఏదో ఒక బోరింగ్ పని చెప్పేది! అంటే, పచ్చడి రోట్లో నూరటం లాంటివి! వాటిని చెయ్యటం కోసం స్నానం చేసి రావాలి! అదో చిరాకు పని! అంటే, స్నానం చేసాక వంటింట్లోకి రావాలంటే చాలా చిరాగ్గా వుండేది.. వాసనలు వంటికి పడతాయి అని!

అందుకే సాధారణం గా నా పని ముగించేసి పైకి అమ్మమ్మ వాళ్ళ రేడియో వినటానికి వెళ్ళిపోయేదాన్ని! కింద వీళ్ళు "పనియే దైవం" వైపు లో పని చేసుకుంటూ పాటలు వినే అవకాశం ఇచ్చేసేదాన్ని! తరువాత వైజాగ్ స్టేషన్ లో వచ్చే పాటలు అన్నీ కొత్త సినిమాల్లోని పాటలు. అందరిళ్ళల్లోనూ రేడియోలు మోగేవి! వాటిని వినటానికి ఇబ్బంది లేదు! మేము స్కూళ్ళకీ, కాలేజీలకీ తయరవుతూ ఇంక బిజీ అయిపోయేవాళ్ళం కూడా.

రాత్రి TV కార్యక్రమాలు కనుక రేడియో ని పట్టించుకొనేవాళ్ళం కాదు. కానీ సిలోన్ లో వచ్చే "బినాకా గీత్ మాలా" (తరువాత ఇది "సిబాకా గీత్ మాలా అయింది) మిస్ అయేదాన్ని కాదు. కానీ అది కూడ ఒక సమస్యే! మా అమ్మ గారికి ఇంట్లో అందరూ కలిసి కనీసం రాత్రి భోజనం చేయాలన్న కోరిక. కానీ ఈ గీత్ మాలా సరిగ్గా 8.00 నుండి 9.00 దాకా వచ్చేది. మా ఇంట్లో రాత్రి భోజనాలు TV చూస్తూ, ముందు గదిలో సరిగ్గా 8.00 - 8.30 మధ్య లో మొదలెట్టాలి! నాకు రేడియో వినేందుకు అవకాశం వచ్చేది కాదు. దాని కోసం నేను గబగబా కుక్కర్ పెట్టేసి, కూర చేయటానికి అమ్మ ని ఖంగారు పెట్టేసి ఎనిమిది అయేసరికి తిండి తినేసేదాన్ని. దానికి మళ్ళీ అమ్మ కి ఒక ఎక్స్ప్లనేషన్ ఇవ్వాల్సి వచ్చేది!! TV లో Top 10 కౌంట్ డవున్ ప్రోగ్రాములు వస్తున్నా, ఆ సిలోన్ లో అమీన్ సాయినీ కామెంట్లు వుంటూ వినటం ఒక ఆనందం!!

ఇంక కరెంటు పోతే నాకు మహా ఖుషీ! అంతా కూడా వినేవారు. నాకు నచ్చిన ప్రోగ్రమ్స్ అందరి చేతా వినిపించి వాళ్ళు కూడా మెచ్చేలా చేయాలన్న సరదా నాకు చిన్నప్పటి నుండీ.. ఆ కారణం చేత.. ఇంట్రెస్ట్ లేకపోయినా, అందరి మీదా బలవంతం గా నాకు నచ్చిన కార్యక్రమాలని రుద్దేదాన్ని!

ఏమిటో ఆ రోజులు! అన్నీ మధుర స్మృతులు!! ఈ కంప్యూటర్లు లేవు, ఈ సినిమాలు సైతం డవున్ లోడ్ చేసుకొని చూడగలిగే టెక్నాలజీ లేదు. కానీ సినిమాలనీ, సంగీతాన్నీ ఆ రోజుల్లోనే ఎక్కువ

ఎంజాయ్ చేసేదాన్నెమో అనిపిస్తుంది!! కరెంటు పోయినప్పుడు ఆరు బయట డాబా మీద కూర్చుని మృదు గంభీరంగా సుశీల పాడుతుంటే కళ్ళు మూసుకొని వింటున్నప్పుడు వున్న ఆనందం ఇవాళ MTV లో నాకు ఇష్టమైనదే, పాట చూస్తుంటే వుందా అని నన్ను నేను ప్రశ్నించుకుంటే, జవాబు చెప్పలేను!!

---

మీ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు రచయిత్రి SKU కి తెలియపరచండి.